53

# నారద గర్వభంగం

నారద మహర్షికి తనను మించిన విష్ణుభక్తుడు లేడన్న గర్వం ఉండేది.

ఒకసారి ఆయన త్రిలోక సంచారం చేస్తూ వైకుంఠానికి వెళ్లాడు. ఆ సమయంలో విష్ణుమూర్తి ఏకాగ్రతతో ఎవరిదో చిత్రాన్ని గీస్తున్నాడు. లక్ష్మీదేవితో సహా అక్కడి వారందరూ తన్మయత్వంతో ఆ దృశ్యాన్నే తిలకిస్తున్నారు.

నారదుని రాకను విష్ణుమూర్తి గమనించనే లేదు. ఆ విషయం ఆయనకి ఎరిగించే ధైర్యమూ ఎవరికీ లేదు.

నారదుడు ఎంతో ఆశ్చర్యంతో, "ఆ చిత్రం ఎవరిది?" అని లక్ష్మీదేవిని నెమ్మదిగా అడిగాడు.

"అది ముల్లోకాలలో విష్ణు దేవుని పట్ల అత్యంత భక్తి కలిగిన ఒక నరునిది!" అని ఆమె చెప్పింది.

'అది తన చిత్రమే అయివుంటుంది'... అన్న నమ్మకంతో దగ్గరగా వెళ్లి చూశాడు నారదుడు. ఆశ్చర్యం... అది ఒక బక్కచిక్కి మురికిగా, రోతగా ఉన్న ఒక ముదుసలి చిత్రం!

ఆ అవమానాన్ని సహించలేక, ఆ పరమ భక్తుడెవరో చూడాలన్న ఆతృతతో వెంటనే భూలోకానికి ప్రయాణమయ్యాడు నారదుడు.

ఒక చిన్నవూరిలో చెప్పులు కుట్టుకుంటూ ఒక ముదుసలి కనిపించాడు. అతని చుట్టూ తోలు ముక్కలు, దారాలు, చింకి గుడ్డలు ఉన్నాయి. మనిషి కుళ్ళిపోయిన బట్టలతో దగ్గరకు వస్తేనే కంపు కొడుతున్నాడు అతను.

ఆ మనిషిని చూడగానే 'శ్రీ మహావిష్ణువు చిత్రం గీస్తుండినది అతని రూపాన్నే!'... అన్న విషయం గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు నారదునికి.



'ఈ రోత మనిషా... పరమభక్తుడు? చూద్దాం- అతని ఆరాధన ఏ రూపంలో ఉందో..!' అనుకొని చాటుగా నుంచుని గమనించసాగాడు నారదుడు.

నిమిషాలు, గంటలు గడుస్తున్నా ఆ ముదుసలి తన పని తాను చేసుకుపోసాగాడే కాని, ఏ విధమైన పూజ కాని - ప్రార్థన కాని చేయలేదు.

నారదుడి సహనం నశించింది. కోపం పట్టలేక ఆ ముదుసలిని శపించబోయాడు.

వెంటనే లక్ష్మీదేవి అక్కడ ప్రత్యక్షమయింది.

"ఆగు నారదా..! ఆ వ్యక్తి ఇంటికి వెళ్లే ముందు ఏమిచేస్తాడో గమనించు" అంది.

చీకటిపడే సమయానికి ఆ ముసలివాడు తోలు ముక్కల్ని, ఇతర సామాన్లన్నీ మూటగా కట్టాడు.

ఆ మూటకి నమస్కరిస్తూ "ఓ దేవా... నాకు రేపు కూడా నేను చేయగలిగినంత పని కల్పించు" అంటూ లేచి ఆ మూటను తీసుకొని ఇంటికి వెళ్లాడు.

లక్ష్మీదేవి- "చూశావా నారదా... ఆ వ్యక్తికి కృషియే దైవం -పని చేయడమే ఆరాధన! తన పనిని చిత్తశుద్ధితో చేస్తాడు. అందుకనే మహావిష్ణువుకు అతనంటే ప్రేమ!" అని చెప్పింది.

అప్పుడు అర్థమైంది నారదునికి - ప్రతి మనిషి తన విధిని నిర్వర్తించడమే నిజమైన భక్తి అని!

★★★

